

రేపట్నుంచి 'మీకోసం'

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మీకోసం పేరుతో ఈనెల 24వ తేదీ నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం పది గంటల నుంచి జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇకపై ప్రతి సోమవారం ఫిర్యాదులు స్వీకరించి వాటికి సత్వర పరిష్కారం చేపడతామని తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- వారం రోజుల్లో కాలువల్లో పూడికతీత
- డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు
- మందులు అందుబాటులో ఉంచుకోవాలి
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టిసారించి, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. డయేరియాపై ముందస్తు చర్యలు చేపట్టి అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల ముందస్తు చర్యలపై వైద్యారోగ్యశాఖ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పారిశుధ్య నిర్వహపై తహశీల్దార్లు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. మురుగునీరు నిల్వ లేకుండా కాలువల్లో పూడికతీత పనులు వారం రోజుల్లో పూర్తి చేసి డయేరియా బారిన ప్రజలు పడకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో మలేరియా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు. పిహెచ్‌సిలతో పాటు సబ్‌సెంటర్ పరిధిలో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు అందుబాటులో ఉంచాలన్నారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో స్టాప్ డయేరియా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో సమన్వయం చేసుకొని ప్రతి ఇంటినీ సందర్శించి డేటా తీసుకొని, డయేరియా అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆశా డే రోజున అన్ని అంశాలపై శిక్షణా ఇవ్వాలని, చేతులు, పరిసరాలు శుభ్రపరచుకోవడంపై ఆశాలు, ప్రజలకు అవగాహనా కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా పారిశుధ్య పనుల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌ఛార్జి ఎస్ఇ బెన్వర్ మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకాలను క్షేత్రస్థాయిలో ఎఇలు పరిశీలించి క్లోరినేషన్ చేయించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల వద్ద టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉన్నాయని, తాగునీటిలో శాంపిల్స్ తీసి ఎప్పటికప్పుడు పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో డిఐఒఐ రాజేశ్వరి, ఉప వైద్యారోగ్యశాఖ అధికారి ఎం.ప్రసాద్, ఐసిడిఎస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శాంతిశ్రీ, సచివాలయాల పర్యవేక్షణాధికారి వాసుదేవరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, డిఎంఒ సత్యనారాయణ, జిల్లా ప్రోగ్రాం అధికారి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్




మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా విద్యార్థుల్లో నైతిక హక్కులు, రాజ్యాంగ విలువలు కాపాడబడతాయని, ప్రభుత్వ పాఠశాలల ద్వారా అందరికీ నాణ్యమైన విద్య అందుతుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ అన్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల శాఖ అధ్యక్షులు ఇ.సిద్దేశ్వరరావు అధ్యక్షతన శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకుంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచుకోవడానికి ప్రత్యేక డ్రైవ్‌ను ఉపాధ్యాయులు చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానం ప్రకారం విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రధానంగా జిఒ నంబరు 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను కాపాడాలన్నారు. గత సంవత్సరంలో 4,600 ప్రాథమిక పాఠశాలలో ఉన్న మూడు, నాలుగు, ఐదు తరగతులను కిలోమీటర్ లోపు ఉన్న ఉన్నత పాఠశాలలో విలీనం చేశారని గుర్తు చేశారు. తక్షణమే తిరిగి పాత పాఠశాలకు పంపించి ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరారు. ఉపాధ్యాయ పోస్టులన్నిటినీ తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఉద్యోగులను, ఉపాధ్యాయులను నిరంతరం చర్చలకు పిలవడం, ప్రజాస్వామ్య పద్ధతిగా వ్యవహరించడం చేయాలన్నారు. వారి న్యాయమైన కోరికలను తీర్చే దానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని హితవు పలికారు. ఎంటియు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, ఉపాధ్యాయ నియామకంలో అప్రంటీస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఉద్యోగులతో, ఉపాధ్యాయులతో ప్రజాస్వామ్య వాతావరణంలో చరించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం వైపు నుంచి సరైన నిర్ణయాలను చేయాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్ బళ్ల చిట్టిబాబు, జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్.వెంకటాచలం, జిల్లా నాయకులు కె.రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరమణ, జిల్లా నాయకులు గున్న మధుసూదనరావు, తమ్మినాన జయరాం, వజ్రపుకొత్తూరు మండల నాయకులు పాల్గొన్నారు.

కక్షసాధింపులు లేవంటూనే విధ్వంసం

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్షసాధింపు పాలన ఉండదంటూనే విధ్వంసాలకు తెరలేపిందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. కాశీబుగ్గ ప్రగతి భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయంలో గెలుపోటములు సహజమని, గెలిచి ప్రభుత్వం ఇంతటి బరితెగింపునకు పాల్పడడం ఎక్కడా చూడలేదన్నారు. ప్రతిపక్షం ఉండకూదదని, ఆ పార్టీ నాయకులు ఉండకూదని, పార్టీకి చెందిన భవనాలు కూలగొట్టాలని దుర్మార్గపు నిర్ణయాలతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచి పరిశీలిస్తే అన్ని జిల్లాల్లోనూ జరిగిన హింసాకాండ ప్రభుత్వ ఉద్దేశాలను చూపుతున్నాయన్నారు. హత్యల దగ్గర నుంచి అమానుషంగా దాడులు చేయడం, ఆస్తులకు నష్టం చేయడం, సచివాలయ, ఆర్‌బికె, విలేజీ క్లీనిక్ వంటి వాటిని ధ్వంసాలకు పాల్పడడం చూస్తున్నామన్నారు. చివరకు వైసిపి కార్యాలయమూ ధ్వంసం చేస్తున్నారు. అసలు రాష్ట్రంలో రాజ్యాంగం ఉందా? చట్టం పని చేస్తుందా? వ్యవస్థలు ఉన్నాయా? అనే సందేహాలు ప్రతి ఒక్కరిలోనూ కలుగుతున్నాయన్నారు. అటవీ రాజ్యాలు, నియంతలు, మానవత్వం లేని నాయకుల గురించి చరిత్రలో చదువుకున్నామని పేర్కొన్నారు. ఇప్పుడు సిఎం చంద్రబాబునాయుడు పాలన ద్వారా కల్లారా చూస్తున్నామన్నారు. ప్రమాణస్వీకారం చేసి పది రోజులు కాకముందే రాష్ట్రంలో భయానీక వరిస్థితులు చూస్తుంటే రాబోయే ఐదేళ్లల్లో ఎలా ఉందనుందో స్పష్టమవుతుందన్నారు. కక్షలు లేవంటునే వారి మాటలు తేనె పూసిన మాటలు అదుతూ పాల్పదుతున్న విధ్వంసాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. శాసనసభ స్పీకర్ స్థానంలో పెట్టిన అయ్యన్నపాత్రుడు ఇటీవల మాట్లాదుతున్న మాటల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్ ఓడిపోయాడని, చావలేదని, చచ్చే వరకు కొట్టాలని అంటూ ఆడిన మాటలు వీడియోలు, టివిల ద్వారా అందరు చూశారని అన్నారు. అటువంటి స్పీకర్ అసెంబ్లీల్లో వైసిపి నాయకులకు గొంతు విప్పే అవకాశం ఇస్తారన్నది అసాధ్యమని భావించాలన్నారు. ఎక్కుడైతే కూల్చివేత మొదలుపెట్టారో అక్కడ పున:నిర్మాణం మొదలవుతుందని అన్నారు. గతంలో ఇందిరాగాంధీకి వంద శాతం తక్కువగా ఓట్లు వస్తే హోదా లేకపోయినా ప్రతిపక్ష హోదా ఇచ్చారని గుర్తు చేసుకోవాలన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

గంజాయి అక్రమ రవాణాపై నిఘా

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - బూర్జ

గంజాయి, నాటుసారా అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా బూర్జ పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తుపై అధికారులను అడిగి తెలుసుకుని, దిశానిర్దేశం చేశారు. స్టేషన్ పరిసరాను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎటువంటి అనధికార కేసు ప్రాపర్టీని స్టేషన్‌లో ఉంచకుండా కోర్టు ఉత్తర్వుల మేరకు డిస్పోజల్ చేయాలన్నారు. నాటుసారా, గంజాయి వంటి మాదకద్రవ్యాలు క్రయ, విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రణాళిక మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులు, ఫిర్యాదుదారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి చట్ట ప్రకారం న్యాయం చేయాలన్నారు. ఆమె వెంట ఆమదాలవలస సిఐ దివాకర్, ఎస్ఐ జి.వి ప్రసాద్ ఉన్నారు.

కార్పొరేషన్ కమిషనర్ అన్సారియా బదిలీ

ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా నియామకం



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియాను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఐఎఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం జిఒ నంబరు 1100 విడుదల చేసింది. అందులో భాగంగా ఆమెను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఆమె ఈ ఏడాది జనవరి 28న జిల్లాకు వచ్చారు. ఆమె భర్త, ప్రస్తుత జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ కూడా అదే రోజు నియమితులయ్యారు. ప్రస్తుత బదిలీల్లో ఆయనకు మాత్రం స్థానచలనం చేయలేదు.

తమీమ్ అన్సారియా 2015వ బ్యాచ్ యుపి కేడర్ ఐఎఎస్ అధికారి. ఉత్తరప్రదేశ్‌లో 2017లో పాఠశాల విద్య సహాయ కార్యదర్శిగా పనిచేశారు. 2019లో ఉత్తరప్రదేశ్‌లోనే పతేపూర్ జిల్లా చీఫ్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేశారు. నేషనల్ హెల్త్ మిషన్ అడిషనల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. మనజీర్ జిలానీ సమూన్‌ను వివాహం చేసుకున్న తరువాత 2020లో ఎపి కేడర్‌కు కేటాయించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మే వరకు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇదిలా ఉండగా శ్రీకాకుళం నగరపాలక సంస్థకు కమిషనర్‌గా కొత్తగా ఎవరినీ నియమించలేదు.

ఆయకట్టు భూములకు నీరందించాలి

రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

వంశధార 48ఆర్, 49ఆర్-6 కాలువలో పూడికలను తొలగించి ఆయకట్టు భూములకు నీరందించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు డిమాండ్ చేశారు. దాలిట్యాంకు ముంపు వల్ల జయకృష్ణాపురం, మోదుగువలస, శ్రీరంగం, ధర్మనీలాపురం తదితర గ్రామాల భూముల ముంపు సమస్యను పరిష్కరించాలన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయ ఆవరణలో రైతుసంఘం మండల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార కాలువలు, చెరువులు, మదుములు, షట్టర్లను బాగు చేసి నీరందించాలన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలను పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల ద్వారా రుణాలను ఇవ్వాలని, పెట్టుబడి సాయంగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్నా రూ.20 వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. బొడ్డేపల్లి మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పై సమస్యలు పరిష్కరించాలని టెక్కలి ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. అనంతరం 15 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. సమావేశంలో రైతుసంఘం మండల కార్యదర్శి బగాది వాసుదేవరావు, వాకాడ ధనుంజయరావు, గూన బాలాజీ, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

'అరబిందో' కార్మికుల....

ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలి



మాట్లాడుతున్న అమ్మన్నాయుడు, తేజేశ్వరరావు

ప్రజాశక్తి - రణస్థలం

ఎపిటోరియా ఫార్మా (అరబిందో ఫార్మా) కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. పైడిభీమవరం వద్ద గల అరబిందో ఫార్మా యాజమాన్యం 2021లో మూడేళ్ల కాలపరిమితితో యాజమాన్యం ఏకపక్షంగా ప్రకటించిన వేతనాల కాలపరిమితి 2024 మార్చితో ముగిసిందని తెలిపారు. నూతన వేతన ఒప్పందం కోసం అరబిందోఫార్మా వర్కర్స్ యూనియన్ ఎపిటోరియా ఫార్మాకు వినతిపత్రం అందజేశామని అన్నారు. 2021 నాటి కన్నా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి కార్మికుల జీవనం కష్టంగా ఉందన్నారు. కంపెనీలో ఐదేళ్లు సర్వీసు దాటిన కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన వేతనం అలవెన్స్ రూపంలో కాకుండా బేసిక్ వేతనంలో కలపాలన్నారు. ప్రతి కార్మికుడికీ అటెండెన్స్ బోనస్ రెండు సెలవులను అనుమతిస్తూ నెలకి రూ.వెయ్యి ఇవ్వాలన్నారు. సి షిఫ్ట్ అలవెన్స్ రూ.50 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలని, బస్సు సౌకర్యం లేనివారికి నెలకు రూ.15 టిఎ ఇవ్వాలన్నారు. బోనస్ ఒక నెల గ్రాస్ వేతనం ఇవ్వాలన్నారు. పరిశ్రమలో పనిచేస్తూ కిడ్నీ, కేన్సర్, పక్షవాతం తదితర వ్యాధుల బారిన పడిన కార్మికులకు యాజమాన్యం ప్రకటించిన రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించిన కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు.

మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వాబ యోగి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాల విభజనలో శ్రీకాకుళం జిల్లాలోని గిరిజనులు ఐటిడిఎ కోల్పోయారని, మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎను నెలకొల్పాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు వాబ యోగి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నగరంలోని ప్రయివేటు భవనంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలని దపదఫాలుగా ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. టిడిపి ఎన్నికలకు ముందు ఐటిడిఎ ఏర్పాటుకు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించామని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలాస, పాతపట్నం బహిరంగ సభల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని ప్రకటించారని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు సత్వరమే మెళియాపూట్టి కేంద్రంగా ఐటిడిఎను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులతో చర్చించి ఐటిడిఎ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను తొలగించి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. జిల్లాలోని నకిలీ ఎస్‌టి ధ్రువపత్రాలపైనా విచారణ చేపట్టి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెజ్జి కృష్ణ, సవర శోభన్, పాపారావు, జన్ని మోహన్, కె.హరీష్, జోగారావు, పి.ప్రకాష్ పాల్గొన్నారు.

అచ్చెన్న వ్యాఖ్యల దుమారం



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే లేపాయి. ప్రభుత్వ కార్యాలయాలకు పసుపు బిల్ల పెట్టుకుని వెళ్తే వారే కుర్చీలు వేసి, టీ ఇచ్చి మీ పనులు చేస్తారంటూ చెప్పడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఒక రకంగా కార్యకర్తలను రెచ్చగొట్టడమేనని అధికారులు, ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. పైగా ఒకరిద్దరు అధికారులు మాట జవదాటితే వాళ్లేమి అవుతారో చెప్పనని, చేసి చూపిస్తానని చెప్పడాన్ని ఉద్యోగ వర్గాలు తప్పుపడుతున్నాయి. ఉద్యోగులను పీడించి నానా రకాలుగా ఇబ్బంది పెట్టిన వైసిపి ప్రభుత్వాన్ని కాదని కూటమిపై నమ్మకంతో మెజార్టీ శాతం ఉద్యోగులు పార్టీని ఆదరించి, దగ్గరవుతున్న తరుణంలో అచ్చెన్నాయుడు ఈ రకంగా నోరు జారడం పార్టీకి నష్టం చేసేలా ఉన్నాయనే అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. ఇటువంటి వ్యాఖ్యలు పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. కన్నూమిన్నూ కానక అధికారులు, ఉద్యోగులను తూలనాడిన వైసిపి ప్రభుత్వ మంత్రులు, మాజీ ప్రతినిధుల పరిస్థితి ఏమిటో ఇప్పుడు అంతా చూస్తున్నాం. గతంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో అప్పటి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావుపై పరుష వ్యాఖ్యలు చేసి తీవ్ర విమర్శలు పాలైన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రస్తుతం ప్రజల ఛీత్కారానికి గురయ్యారు. శాసనసభ మాజీ స్పీకర్, కొంత మంది తాజా, మాజీలు సైతం వారి క్యాంప్ కార్యాలయాలకు వెళ్లిన అధికారులను, ఉద్యోగులను ఎన్నో ఛీత్కారాలు, అవమానాలకు గురి చేసిన సందర్భాలు చూశాం. వారిలో ఒక్కరూ మళ్లీ ఎన్నిక కాలేదు. అధికారం, పదవి ఉందని విర్రవీగితే ప్రజలు క్షమించరని ప్రజా ప్రతినిధులంతా గుర్తించాలి. గత వైసిపి ప్రభుత్వం చేసిన నిర్వాకాలను కేసు స్టడీగా తీసుకుని జిల్లా అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలు కోసం పని చేసేందుకు కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రయత్నించాలి. వారు చేసినట్టే తామూ చేస్తామంటే వైసిపికి, టిడిపికి పెద్ద తేడా ఏమీ ఉందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. ఇప్పటికే ఆ రకమైన చర్చ సామాన్య ప్రజల్లో సాగుతోంది. కొత్త ప్రభుత్వంపై ఈ రకమైన చెడు అభిప్రాయాన్ని వీలైనంత తొందగా చెరిపేసుకోవాలన్న అభిప్రాయం వినిపిస్తోంది.

జడ్‌పిలో అధికారులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలోనూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పరుష వ్యాఖ్యలే చేశారు. జిల్లాలో సాగునీటి శాఖలకు తాళాలు వేసేశారంటూ, ప్రభుత్వ శాఖలు పూర్తిగా పని చేయడం మానేశాయంటూ అధికారులపై అక్కసు వెళ్లగక్కారు. తమపై కనీస గౌరవ మర్యాదలు లేకుండా ప్రవర్తించారంటూ నిందించారు. గతంలో తనకు జరిగిన అవమానానికి, పోలీసులు ప్రవర్తించిన తీరుపై కసితో అంతర్లీనంగా రగిలిపోతున్నట్లుగా ఆయన చేసిన వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. వంశధార కుడి, ఎడమ కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగింపునకు గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క పైసా ఇవ్వలేదు. కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం డిపాజిట్ నుంచి వచ్చిన వడ్డీ డబ్బుల నుంచి అప్పటి కలెక్టర్లు జె.నివాస్, శ్రీకేష్ బాలాజీ లాఠకర్‌ను నిధులు విడుదల చేస్తేనే ఆ మాత్రమైనా సాగు నీరివ్వగలిగారు. వంశధార కాలువల ఆధునికీకరణ, ప్రమాదస్థితిలో ఉన్న గొట్టాబ్యారేజికి నిధులు కావాలని అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ఒక్క రూపాయి రాలేదు. తనపై కనీస గౌరవ మర్యాదలు ఇవ్వలేదని అధికారులను నిందిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి ప్రోటోకాల్ ప్రకారం టెక్కలి ఎమ్మెల్యేగా అధికారులు ఆహ్వానించిన సమావేశాలకు ఏ ఒక్క రోజైనా హాజరయ్యారా? జడ్‌పిలో నిర్వహించిన ఒక్క సమీక్ష సమావేశానికైనా వచ్చారా? సమావేశాలకు వచ్చి ఉంటే వంశధార సాగునీటి సమస్యలు, అధికారులు సాగించిన ప్రయత్నాలు, ప్రభుత్వ ఉదాసీనం ఏమిటో అవగతమయ్యేది.

వైసిపి ప్రభుత్వ హయాంలో కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో కొండపై పిహెచ్‌సి భవనాన్ని నిర్మించడంపై జడ్‌పి సమావేశంలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులపై ఒంటి కాలిపై లేచారు. తమ సొంత గ్రామంలో భవనం నిర్మాణ అంశాన్ని తమకు తెలియజేయకపోవడమేమిటంటూ మండిపడుతున్నారు. భవన నిర్మాణానికి అసలు ఎవరు అనుమతులు ఇచ్చారు, కలెక్టర్రా? తహశీల్దారా? రాష్ట్ర స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బెదిరింపులకు దిగటం అధికారులు, ఉద్యోగులను విస్మయానికి గురి చేసింది. తప్పులు జరిగితే చర్యలు తీసుకోవడాన్ని ఎవరూ తప్పు పట్టరు. ఇందులో ప్రజాప్రతినిధుల పాత్ర సంగతి ఏమిటో కూడా చూడాల్సి ఉంది. ప్రజాప్రతినిధులు ఏం చెప్తే అది చేయకపోతే మంత్రి అచ్చెన్నాయుడు ఇప్పుడు వారి సంగతి ఎలా చూస్తామన్నారో గతంలోనూ అదే జరిగింది. అధికారులు, ఉద్యోగులు సాధారణంగా నిబంధనల ప్రకారం పనిచేయాలని కోరుకుంటారు తప్ప రిస్క్ తీసుకోవాలని ఎవరు మాత్రం కోరుకుంటారు?. గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఇఎస్ఐ ఆస్పత్రులకు మందులు, పరికరాల కొనుగోలులో ప్రస్తుత మంత్రి అచ్చెన్నాయుడునే నిందితుడిగా చేసి అరెస్టు చేసిన విషయం అందరకు తెలిసిందే. గతంలో చోటుచేసుకున్న అవకతవకలు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పనుల విషయంలో అప్పటి ప్రజాప్రతినిధుల జోక్యంపైనా విచారణ చేపడితే భవిష్యత్‌లో తప్పులు చేయాలని ఎవరూ చెప్పే పరిస్థితి ఉండదు.

వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడి పసుపు బిల్ల అంశం కూటమిలోని మూడు పార్టీల మధ్య చిచ్చు పెట్టేలా ఉందనే చర్చ మరో వైపు నడుస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలకు పసుపు బిల్ల పెట్టుకుని వెళ్తేనే పని చేస్తే తమ పరిస్థితి ఏమిటని జనసేన, బిజెపి పార్టీలకు చెందిన కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేస్తే ఇప్పుడు ఆ పార్టీ, ఈ పార్టీ కార్యకర్తలు అంటూ విభజన తీసుకురావడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు అచ్చెన్న వ్యాఖ్యలను మేధావులు, అభ్యుదయ వాదులు తీవ్రంగా తప్పుపడుతున్నారు. తన మాట వినని అధికారుల సంగతి చూస్తానని బెదిరించడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలకనుగుణంగా ఒక పద్ధతి ప్రకారం విధులు నిర్వర్తించాలనుకునే అధికారులకు, ఉద్యోగులకు అచ్చెన్న వ్యాఖ్యలు ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజలకు మంచి చేయడానికి ఎమ్మెల్యేలను ఎన్నుకుంటే... కార్యకర్తలను కూర్చోపెట్టి పనులు చేయమని చెప్పడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి పద్ధతులు, ఉద్యోగులపై పౌరుష వ్యాఖ్యలు మానుకోవాలని అంతా హితవు పలుకుతున్నారు.

కొత్త నేర చట్టాల అమలును ఆపాలి

ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు మోహనరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

దేశంలో జూలై ఒకటి నుంచి అమలులోకి రానున్న కొత్త నేర చట్టాల అమలును ఆపాలని ఐలూ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహనరావు కేంద్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న భారతీయ శిక్షా స్మృతి 1860, భారతీయ సాక్ష్యాధారాల చట్టం 1872, భారతీయ నేర విధాన స్మృతి 1973 రద్దు కానున్నాయని అన్నారు. వాటి స్థానంలో భారతీయ నాగారిక్ సురక్ష సంహిత 2023, భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ సాక్ష్య అదినియం 2023 అనే మూడు కొత్త నేర చట్టాలు జూలై 1 నుంచి అమలులోకి రానున్నాయని తెలిపారు. ఈ కొత్త చట్టాల్లోని పలు నిబంధనల రాజ్యాంగ బద్ధతపై అనేక రకాల న్యాయ సంశయాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ చట్టాల్లోని సవరణలు చాలా వరకు క్రూరమైన, స్వభావం కలిగినవిగా ఉన్నాయని అన్నారు. ఇవి మన ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడానికి, భారత్‌ను ఫాసిస్టు రాజ్యంగా మార్చడానికి ప్రభుత్వానికి శక్తిని ఇస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ చట్టాలపై న్యాయమూర్తులు, న్యాయవాదులు, నేర పరిశోధన సంస్థలు పార్లమెంటు, శాసనసభలు న్యాయ నిపుణులు, వివేకసిలురు, మేధావులు, పౌరులు సమగ్రంగా అధ్యయనం చేసి చర్చించ్చాలి ఉందన్నారు. కనుక ప్రస్తుతానికి కొత్త నేర చట్టాల అమలు ఆపాలని డిమాండ్ చేశారు.

'నీట్'ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- పలాస

ఏటా దేశవ్యాప్తంగా మెడికల్ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించే 'నీట్' పరీక్ష విశ్వసనీయతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, తక్షణమే నీట్‌ను రద్దు చేయాలని రీసెర్చ్ స్కాలర్ బమ్మిడి సంతోష కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఏడాది నిర్వహించిన నీట్ పరీక్ష పేపర్ లీక్ అయిందని వార్త దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులకు మనోవేదన మిగిల్చిందన్నారు. గ్రామాల నుంచి తమ పిల్లలను పట్టణాలకు పంపించి కోచింగ్ ఇప్పించిన తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతమని అన్నారు. 2017 నుంచి కేంద్ర విద్యాశాఖ పరిధిలోని ఎన్‌డిఎ ఆధ్వర్యాన నిర్వహించే పరీక్షలు రోజురోజుకూ విశ్వసనీయతను కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రంలోనే నీట్ పరీక్షల్లో ఎక్కువగా అవినీతి జరిగిందని ఆరోపించారు. ఇందుకు ఆ రాష్ట్రాల్లో రాసిన విద్యార్థులకు మాత్రమే మొదటి ర్యాంకు రావడం సాక్షాలని అన్నారు. సాక్షాత్తు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కేవలం రెండు చోట్ల మాత్రమే అక్రమాలు జరిగాయని అంగీకరించడం గమనార్హమని అన్నారు. దీనిపై దర్యాప్తు చేయాలని కోరారు.



నీటి నిల్వలను తొలగిస్తున్న బృందం

గూనపాలెంలో స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ పిఒ శోభారాణి అన్నారు. ఈ మేరకు సూపర్‌వైజర్ బి.యోగేశ్వరమ్మ, ఎఎన్ఎం ప్రమీల, ఆశా వర్కర్లు దుర్గ, అంగన్వాడీ వర్కర్స్ పర్యవేక్షణలో గూనపాలెం, మంగువారితోట ప్రాంతాల్లో శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నీటి నిల్వ కుండీలను తొలగించారు. గర్భిణులు, బాలింతలు శుద్ధమైన నీటిని వాడాలని సూచించారు. ఎఎన్ఎం ప్రమీల మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిని కాలువల్లో పార వేయకూడదని, దానివల్ల బ్యాక్టీరియా వృద్ధి చెందుతుందని, తద్వారా రోగాలు వ్యాప్తి చెందుతాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త శ్రీవిద్య, పార్వతి, కమర్జాన్ బేగం, సరస్వతి, ముత్యాలమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

15 వసంతాల 'మాతృమూర్తి'

ప్రజాశక్తి- కవిటి

సొంత లాభం కొంతమానుకుని పొరుగువానికి సాయపడవోయ్... దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ కవిత స్ఫూర్తిగా నేటి యువతరం సాగుతోంది. యువత అనగానే చాలామంది సినిమాలు, షికార్లు, పబ్బులు, రెస్టారెంట్లు అనుకుంటారు. కానీ, నేటి యువత సరదాగా గడుపుతూనే సామాజిక సేవలో ముందుంటుంది. పలు సామాజిక సేవా సంఘాల ద్వారా సమాజానికి చెరువవుతోంది. ఆ కోవలోకి చెందినదే మండలంలోని కుసుంపురానికి చెందిన మాతృమూర్తి యువజన సంఘం. బడుగు బలహీనవర్గాలకు చెందిన ఓ పదిమంది యువకులు ఆపద సమయంలో తాము అనుభవించిన వేదన, తమ కుటుంబ నేపథ్యం, సామాజిక పరిస్థితులు చూసి చలించిపోయి తమలా మరొకరు బాధపడకూడదనే దృఢ సంకల్పంతో చేయిచేయూ కలిపి ఆపద అన్నవారికి చేయూత అందించేందుకు ఒక సామాజిక సంఘం స్థాపించి ఆపద అంటే సరే పద అంటూ ఆర్తులకు అండగా నిలుస్తున్నారు. చేయిచేయి కలిపి సేవ చేస్తున్నారు.



రక్తదానం చేస్తున్న సంఘ సభ్యులు

కేవలం పది మంది సభ్యులతో 2010లో ప్రారంభమైన మాతృమూర్తి యువజన సంఘం ఇప్పుడు వంద మందితో ముమ్మరంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోంది. గ్రామాల్లో శ్రమదానంతో పాటు ఆర్తులకు అండగా నిలుస్తోంది. ఇప్పటి వరకూ 155 కుటుంబాలకు అన్నపూర్ణ అమృతహస్తం పేరిట నెలకు సరిపడే నిత్యావసర వస్తువులు అందించింది మాతృమూర్తి యువజన సంఘం. అదే విధంగా ఆపదలో ఉన్న పలు కుటుంబాలకు ఆర్థికంగా చేయుత అందిస్తోంది. గ్రామంలో రూ.1.20 లక్షలతో వినాయక, సరస్వతి విగ్రహాలు నిర్మించడమే కాకుండా పండగ పూట కళాకారులను సన్మానించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, కరోనా, తుపాను వంటి ప్రకృతి విపత్తులు సంభవించే సమయాల్లో ప్రజలకు నిత్యావసర వస్తువులు అందజేయడం మాతృమూర్తి యువజన సంఘం నిత్యకృత్యం.

రక్తదానంపై అవగాహన

మాతృమూర్తి యువజన సంఘం చేపడుతున్న మరో ముఖ్య సామాజిక సేవా కార్యక్రమం రక్తదానంపై అవగాహన సదస్సులు నిర్వహించడం. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజల్లో రక్త దానంపై చైతన్యం కలిగిస్తున్నారు మాతృమూర్తి సభ్యులు. అంతేకాకుండా ఇప్పటి వరకూ తమ సంఘం ద్వారా ఐదు రక్తదాన శిబిరాలు నిర్వహించడం విశేషం. అలాగే మిగతా స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే రక్తదాన శిబిరాల్లో మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు పాల్గొనడమే కాకుండా రక్తదానం చేసేలా యువతను ప్రోత్సహిస్తోంది.



బాధితులకు సాయం అందిస్తున్న సభ్యులు

జీవితానికో సార్థకత



మనిషిగా పుట్టిన తరువాత జీవితానికో సార్థకత ఉండాలన్నది పెద్దల మాట. మనం ఏ పని చేసినా దొరకని ఆత్మ సంతృప్తి ఎవరో తెలియని వ్యక్తికి, కుటుంబానికి అండగా నిలిచినా, ఆపదలో చేయూత అందించినా దొరుకుతుంది. అది మాటలకు అందని తృప్తి. అలాగే మనల్ని చూసి మరికొంత మంది యువత సామాజిక సేవా క్షేత్రంలోకి వచ్చేందుకు అవకాశం ఉంటుంది. మాతృమూర్తి యువజన సంఘంలో సభ్యులు సామాన్య కుటుంబంలో నుంచి వచ్చిన వారు. వారివారి కుటుంబ నేపథ్యమే మా ప్రయాణానికి నాంది. మరింత మంది ఆర్తులకు అండగా నిలవాలన్నదే మా ప్రయత్నం.

- మోహన్ దొలాయి, సంఘం సలహాదారుడు

వరి విత్తనాల పంపిణీ

వజ్రపుకొత్తూరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరి విత్తనాలను రైతులకు పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మదుకేశ్వరరావు శనివారం పంపిణీ చేశారు. మండలంలోని నగరంపల్లిలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అవసరమైన విత్తనాలను అందజేశారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచన మేరకు మొలక శాతాన్ని పరిగణలోకి తీసుకుని విత్తనాలను వినియోగించాలని రైతులను కోరారు. రైతులకు అవసరమైన విత్తనాలతో పాటు ఎరువులు, క్రిమిసంహార మందులు, యంత్ర సామగ్రిని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉండేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ దువ్వాడ జయరాం చౌదరి, ఎంపిటిసి బమ్మిడి మోహనరావు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని తామడలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు కె.స్వేత, సౌజన్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పొందూరు: ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ అన్నారు. పొందూరు పట్టణంలో రైతులకు వరి విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి అనకాపల్లి వాణి, పొందూరు పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి చిన్న రంగా, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరినాయుడు, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ ఎంపిటిసి పి.లక్ష్మి, కాలెపు శ్రీను, బాల, ఏ.భవానీశంకర్, రాంబాబు పాల్గొన్నారు.

మండలంలోని గోకర్ణపల్లిలో రాయితీ వరి విత్తనాలను టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకుల రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చక్రధర్ నాయుడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



పొందూరు : విత్తనాలను పంపిణీ చేస్తున్న శ్రీరంగనాయకులు

నౌపడ సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం సచివాలయం వద్ద దండుగోపాలపురం, చెట్లతాండ్ర, ఆరికవలస గ్రామానికి చెందిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు వరి విత్తనాలు అందించారు. కార్యక్రమంలో చెట్లతాండ్ర సర్పంచ్ పంగ అసిరినాయుడు, ఆరికవలస సర్పంచ్ గున్న దండాశి, దండుగోపాలపురం మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు, సంతబొమ్మాళి మండలం ఐటిడిపి అధ్యక్షులు బెండి అరుణ్‌కుమార్, కార్యదర్శి ఆరంగి మధు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

మాతృభాష గొప్పది

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతిఒక్కరూ తమ మాతృభాషపై మక్కువ పెంచుకోవాలని అల్లినగరం హెచ్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు మాడుగుల రామారావు మాస్టారు అన్నారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హరిబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించిన విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతృభాషపై పట్టు సాధించుకుంటే ఇతర భాషలను ఆవలీలగా నేర్చుకోగలరని అన్నారు. అతి ప్రాచీనమైన ద్రావిడ భాషల్లో తెలుగు భాష ఒకటి అన్నారు. 2023-24లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలో తెలుగు సబ్జెక్టులో నూటికి 95 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సంస్థ తరుపున సన్మానించారు. 11 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున నగదుతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఛారిటబుల్ ట్రస్టు కార్యదర్శి మాడుగుల శ్రీనివాసరావు, అబ్బుల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ పట్నాయక్, తెలుగు ఉపాధ్యాయులు దండా ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు ఉమారావు, సీతమ్మ, నాగరాజు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సక్రమంగా రేషన్ సరుకుల పంపిణీ

పలాస : రేషన్ సరుకులు సక్రమంగా వంపిణీ వేయాలని, సమయ పాలన పాటించాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ ఆదేశించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో డివిజన్‌స్థాయి తహశీల్దార్లతో, ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా 15 నాటికి రేషన్ సరుకులు పూర్తిస్థాయిలో మొబైల్ రేవన్ వాహనాలు పంపిణీ చేయాలన్నారు. సరుకుల పంపిణీలో తేడాలుంటే చర్యలు తీసుకోవాలన్నారు.



సమీక్షిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్



వివాహిత బలవన్మరణం

లావేరు : మండలంలోని చిన్నమురపాకకు చెందిన సిరిపురపు నాగమణి (35) తన ఇంటిలో ఉన్న ఫ్యానుకు ఉరుపోసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగమణి తన భర్త చెల్లయ్య అప్పుడప్పుడు ఇంట్లో గొడవ పడే వారు. ఎప్పటిలాగే గురువారం సాయంత్రం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భర్త మందలించడంతో క్షణికావేశానికి గురైన నాగమణి ఇంటి తలుపులు ముసువేసి ఫ్యాన్‌కు ఉరి పోసుకుంది. తలుపు బద్దలు కొట్టి చూడగా కొన ఊపిరితో ఫ్యాన్‌కు వేలాడుతున్న నాగమణిని గుర్తించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలకు గ్రీష్మ, రమ్య ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మృతురాలు తండ్రి రౌతు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ స్వామినాయుడు కేసు నమోదు చేశారు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చెన్నైలో జిల్లావాసి మృతి

ప్రజాశక్తి- నౌపడ

జీవనోపాధికి వలస వెళ్లిన భావనపాడుకు చెందిన కోయిరి సోమేష్ (47) మత్స్యకారుడు తిరుగు ప్రయాణంలో రైలు నుంచి జారిపడి మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోయిరి సోమేష్ గత కొంతకాలంగా చెన్నయ్‌లో కూలీ పనులు చేస్తున్నారు. విజయవాడలో కనకదుర్గ అమ్మవారి ఆలయానికి వెళ్లడానికి ఈ నెల 21న ఉదయం పెరంబూర్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరారు. అయితే విజయవాడ వెళ్లావల్సిన రైలు కాకుండా బెంగుళూర్ వైపు వెళ్లే రైలు ఎక్కడంతో గంట పాటు ప్రయాణం చేసి తిరువళ్లూరు రైల్వే స్టేషన్లో దిగారు. అక్కడి నుంచి చెన్నయ్ సెంట్రల్‌కు లోకల్ రైల్లో ప్రయాణం సాగిస్తుండగా... రైలు నుంచి జారిపడిపోయారు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మతిచెందారు. మృతుడు ఫోన్లో ఉన్న నంబరు ద్వారా కుటుంబ సభ్యులకు రైల్వే పోలీసులు సమాచారం అందజేశారు. దీంతో శనివారం మృతుడు తమ్ముడు సింహాచలం అక్కడి వెళ్లి తన అన్న సోమేష్ మృతదేహమని నిర్ధారించారు. మృతుడికి భార్య గురమ్మ, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అయితే మృతదేహం స్వస్థలానికి తీసుకొచ్చేవిధంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు చర్యలు చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తల్లీపిల్లలు అదృశ్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



అదృశ్యమైన తల్లీపిల్లలు

మండలంలో తీరప్రాంత గ్రామం దొంకూరులో తలీపిల్లులు కొద్ది రోజుల క్రితం అదృశ్యమయ్యారని రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు శనివారం తెలిపారు. ఈయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొమ్మిదేళ్ల క్రితం చీకటి చంద్రయ్య, రాములమ్మలకు వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు. ఎనిమిదేళ్ల రంజన, ఐదేళ్ల శృతి ఉన్నారు. ఈ నెల 13న వేకువజామున 5 గంటలకు చంద్రయ్య చేపల వేటకు వెళ్లాడు. చంద్రయ్య తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. పిల్లలతో కలిసి రాములమ్మ ఇంట్లో ఉంది. ఉదయం 10 గంటలకు రాములమ్మ అత్తామామలు ఇంటికి వచ్చి చూడగా, ఎవరూ లేరు. సమాచారం అందుకున్న చంద్రయ్య ఇంటికి చేరుకుని పరిసరాల్లో వెతికారు. బంధువుల ఇళ్లల్లో వాకబు చేశారు. ఎప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్పీకర్‌కు 'ఎన్ఇఆర్' శుభాకాంక్షలు

లావేరు : ఆంధ్రప్రదేశ్ నూతన శాసనసభ స్పీకర్‌గా శనివారం అసెంబ్లీలో నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడకుదిటి ఈశ్వరరావు అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మీ సుదీర్ఘ రాజకీయ జీవితంలో అపారమైన అనుభవంతో పలుమార్లు రాష్ట్రంలో కీలక మంత్రి పదవులు చేపట్టారని అన్నారు. స్పీకర్ స్థానానికి వన్నె తేవాలని కోరుతూ ఆకాంక్షించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న 'ఎన్ఇఆర్'



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మహిళా స్వావలంబనకు కృషి

శ్రీకాకుళం అర్బన్ : గ్రామీణ ప్రాంతాల మహిళలను స్వావలంబన, స్వయం సమృద్ధి దిశగా నడిపించే లక్ష్యంగా పనిచేస్తామని బౌద్ధమార్గ్ లైవ్లీహుడ్ ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు నగరంలోని జిల్లా శాఖ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సాహకాలు అందించనున్నట్టు తెలిపారు. చేయూత పథకం ద్వారా సూక్ష్మ రుణంతో పాటు నిత్యావసర వస్తువులు అందజేస్తామన్నారు. కుటుంబ పోషణకు సహకారం అందిస్తూ జీవనోపాధులను మెరుగు పరచుకునేందుకు ఫౌండేషన్ తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ న్యాయ సలహాదారు బైరెడ్డి, డైరెక్టర్ నాగరెడ్డి అనంతపురం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మహమ్మద్ రఫీ, ఆదర్శ, కృష్ణ, వరదరాజు పాల్గొన్నారు.

కొత్తూరులో అన్నదానం

కొత్తూరు : కొత్తూరు రామాలయం 8వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన మూడు వేల మంది యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లోతుగెడ్డ లక్ష్మీనారాయణ, భగవాన్‌దాస్ నాయుడు, పొగిరి రవి, జనార్ధన్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి హోదా పునరుద్ధరణకు కృషి



వినతిపత్రం అందజేస్తున్న కృష్ణంరాజు

శ్రీకాకుళం అర్బన్ : పేదవాడి క్రీడగా ప్రసిద్ధి పొందిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు జాతీయ స్థాయి హోదా పునరుద్ధరించేందుకు సహకారం అందించాలని ఎపి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.జి.కృష్ణంరాజు కోరారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. జాతీయస్థాయిలో రాణించిన వందలాది మంది క్రీడాకారుల భవిష్యత్ హోదా పునరుద్ధరణ అంశంతో ముడిపడి ఉందని వివరించారు. సమస్యను కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖతో చర్చించి పరిష్కరించాలని కోరారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకార కార్యదర్శి, శిక్షకులు ఎం.మధుసూదనరావు, మక్క రమేష్, మజ్జి చిన్ని కృష్ణ ఉన్నారు.

కెవికెకు చేరిన టార్చ్ రిలే

ప్రజాశక్తి- ఆమదాలవలస

దేశంలో మొట్ట మొదటి కృషి విజ్ఞాన కేంద్రం పాండిచ్చేరిలో 1974లో ప్రారంభించారని, కెవికెలు ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల భారత వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ జ్యోతి టార్చ్ రిలేను మార్చి 31న ప్రారంభించారని కెవికె ప్రోగాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఈ టార్చ్ రిలే శనివారం కెవికె చేరిందన్నారు. కెవికె శాస్త్రవేత్తల బృందం వ్యవసాయ రంగంలో అందించిన సేవలకు ప్రతీకగా 11 అటారి జోన్లను కలుపుకుంటూ ఢిల్లీకి చేరనుందని తెలిపారు. ప్రస్తుతం ఈ టార్చ్‌ను కెవికె రస్తగుంట బాయి నుంచి అందుకున్నామని, ఇక్కడి నుంచి కొండంపూడి కెవికెకి అందిస్తామని అన్నారు.



టార్చ్ రిలేను అందుకున్న శాస్త్రవేత్తలు

సంక్షిప్త వార్తలు

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి



సూరిబాబు

సంతబొమ్మాళి : ఇటీవల విజయవాడలో జరిగిన ఎపిసిపిఎస్ఇఎ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రెడ్డి సూరిబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సూరిబాబు శనివారం మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే వరకు పోరాటం చేస్తామని అన్నారు. సిపిఎస్ ఉద్యమకారులపై పెట్టిన కేసులను ప్రస్తుత ప్రభుత్వం ఎత్తివేయాలన్నారు.

పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: పశువులకు వర్షాకాలం ఎక్కువగా వ్యాప్తిచెందే గొంతు, జబ్బవాపు వ్యాధికి పాడి రైతులు ప్రభుత్వం ఉచిత అందిస్తున్న నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కురుడు, రామయ్యపేట, బావాజీపేట, యరకయ్యపేట, చౌదరి కొత్తూరు గ్రామాల్లో శనివారం 431 పశువులకు ఉచితంగా గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలను వేశారు. పశువైద్య సిబ్బంది వి.ఎ.ముకుందరావు, జెవిఒ వెంకటరత్నం, నారాయణరావు, గోపాలమిత్ర ధర్మారావు పాల్గొన్నారు.

ఎంఇఒ ఆకస్మిక తనిఖీ

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ అర్జునుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు విద్యార్థుల ప్రగతి, పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులు లఖినాన వెంకటరమణ, కానూరు ఆనందరావు పాల్గొన్నారు.

అంగన్వాడీ పిలుస్తోంది...

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి పంచాయతీ భవానీపురం అంగన్వాడీలో టీచర్, ఆయాలు అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్వాడీలో చేర్చాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యకర్త నరసమ్మ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఆమదాలవలస : ఈ ఏడాది డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ఎస్.ఎన్.స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బికాం కంప్యూటర్స్, బిఎ హిస్టరీ (మేజర్), బిఎ రాజనీతి శాస్త్రం (మేజర్) తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విశాలమైన ఆటస్థలం, విద్యార్థులందరికీ లైబ్రరీ సదుపాయం అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ సదా అవకాశాన్ని ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.



మంత్రితో టిడిపి నాయకులు

మంత్రిని కలిసిన నాయకులు

ఇచ్ఛాపురం : వ్యవసాయశాఖ మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఇచ్ఛాపురం టిడిపి నాయకులు మంత్రి కార్యాలయంలో శనివారం కలిశారు. అలాగే టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలపై వివరించారు. మంత్రిని కలిసిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాలీనా ఢిల్లీ, వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్‌కుమార్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బెందాళం రమేష్, దూపాన సునీల్ పాల్గొన్నారు.

జనసైనికులు తరలిరావాలి

ఆమదాలవలస : నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి వస్తున్నారని, జనసైనికులు తరలిరావాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఒక ప్రకటనలో కోరారు. సాయంత్రం ఆమదాలవలస పారిశ్రామిక వాడ వద్ద నుంచి కృష్ణాపురం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం బహిరంగసభ ఉంటుందని అన్నారు.

చెడు వ్యసనాలతో భవిష్యత్ నాశనం



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ గణేష్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మారకద్రవ్యాలను కలిసికట్టుగా నిర్మూలిద్దామని టెక్కలి ఎక్సైజ్ ఎస్ఐ కె.గణేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎక్సైజ్ పోలీస్ ఆధ్వర్యాన మారకద్రవ్యాలకు వ్యతిరేక శనివారవ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చేందుకు యువత కృషి చేయాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాసనం చేసుకోవద్దన్నారు. ఎక్కడైనా గంజాయి అమ్మినట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో లెక్చరర్లు మాధవరావు, రమణమూర్తి, భాస్కరరావు, సంజయ్ కుమార్, రోజా, మాధురిదేవి, నళిని పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన


ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో పెద్దపద్మాపురంలోని చెత్త సంపద కేంద్రాన్ని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ శనివారం పరిశీలించారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మెళియాపుట్టిలో చేపడుతున్న కాలువల్లోని పూడికతీత పనులను పరిశీలించారు. పారిశుధ్యం లోపించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఇఒపిఆర్‌డి టి.తారకేశ్వరరావుకు ఆదేశించారు. డ్రెయినేజీ పనులను పరిశీలించారు. అలాగే చెత్త సంపద కేంద్రంపై పలు సూచనలు చేశారు. ఈయన వెంట పెద్దపద్మాపురం సర్పంచ్ ప్రతినిధి శ్రీధర్, కార్యదర్శి చింతల అప్పారావు ఉన్నారు.



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న రమణ

విద్యుత్ యంత్రం ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక వల్లభరాయ శ్మశాన వాటికలో విద్యుత్ శవదహన యంత్రం ఏర్పాటుపై రోటరీ క్లబ్‌లో డాక్టర్ త్రినాథ్‌రెడ్డి శనివారం ప్రజాభిప్రా య సేకరణ చేపట్టారు. శ్మశాన వాటిక లో గ్యాస్ సంహిత శవ దహన యంత్రం ఏర్పాటుకు మొక్క చూపారు. ప్రజలు అడిగిన సందేహాలను పైడిశెట్టి దినేష్ నివృత్తి చేశారు. డాక్టర్ వేదవ్యాస్ అధ్యక్షతన ప్రాజెక్టు చైర్మన్‌గా చేపట్టబోయే కార్యక్రమానికి మరికొంత మంది దాతలు ముందుకొచ్చారు. వచ్చే నెలలో అన్ని వార్డుల ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం యంత్రం ఏర్పాటు చేస్తామని రోటరీ ప్రతినిధులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రోహిత్, పాకా తులసీదాసురెడ్డి, శాసనపురి ప్రదీప్, కాళ్ల ధర్మారావు, ఎస్.ఎన్.పండా, జయదేవ్, బచ్చు జగన్, మటూరి సూర్యం, రావి జయకృష్ణ, బర్ల లక్ష్మణ్, రంగాల శ్రీను, సదాశివుని శ్రీను, మురళీపండా పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మట్టి నమూనాను సేకరిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- రణస్థలం

రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. శనివారం లావేరు మండలంలోని గురుగుబిల్లి, తాళ్ళవలస గ్రామాలకు చెందిన బి.పట్టాభి, వి.సూర్యనారాయణకు చెందిన పొలాల్లో సంస్థ ఆధ్వర్యాన చేపడుతున్న భూసార పరీక్షలకు మట్టి నమూనా సేకరణ విధానాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలకు అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి, నేల సారవంతం కోల్పోయి కాలుష్యానికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూసార పరీక్షలతో నేలలో లభ్యమయ్యే పోషకాలతో పాటు చౌడు గుణాలు, ఎక్కువ సున్నం కలిగిన గుణాల్ని కూడా తెలుసుకుని తద్వారా ఎరువుల యాజమాన్య పద్ధతులు చేపట్టడం వల్ల పంటలపై పెట్టే పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ జిల్లా ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సిబ్బంది రావాడ కృష్ణ, రైతులు బి.సత్యారావు, బి.అన్నారావు పాల్గొన్నారు.